క్లుప్తంగా

చింతలమానెపల్లి తహసీల్దార్‌గా నాగరాజ్ గౌడ్


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజ్ గౌడ్

చింతలమానెపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా నాగరాజ్ గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో విధులు నిర్వహించి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మష్కూర్ అలీ కౌటాల తహసీల్దార్‌గా వెళ్లారు.

కౌటాల తహసీల్దార్‌గా మస్కూర్ అలీ


బాధ్యతలు స్వీకరిస్తున్న మస్కూర్ అలీ

కౌటాల: మండల తహసీల్దార్‌గా మస్కూర్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కౌటాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సాయన్న బదిలీపై వెళ్లారు. స్థానిక నాయకులు ఇద్దరిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

'మన ఆరోగ్యం మన చేతుల్లోనే'

ఆసిఫాబాద్‌రూరల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆయుర్వేద వైద్యాధికారి శిల్ప అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజల జీవనశైలి మారాలని, ఫాస్ట్ ఫుడ్, నిలువ ఉంచిన పచ్చళ్ల వంటివి తినడం తగ్గించుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని టీ హబ్‌లో 57 రకాల వైద్య పరీక్షలు చేసుకోవచ్చని, వీటిపై ఆశలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది రషీద్, లలిత, ఆశ అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పెంచికల్‌పేట్: గృహలక్ష్మి పథకానికి అర్హులైన మహిళలు ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గంగాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్ను, భూమి పత్రాలు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్సు, రెండు పాస్‌ఫోటోలు సమర్పించాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 9014947614లో సంప్రదించాలన్నారు.

కాగజ్‌నగర్‌లో ర్యాలీ

కాగజ్‌నగర్‌టౌన్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్‌స్టేషన్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఘనంగా టీయూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) 13వ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సదాశివ్, వెంకట్రావు, రాథోడ్ ప్రకాశ్, రవీందర్, శంకర్‌రావు, మధుకర్, విద్యాసాగర్, తిరుపతి, రాజన్న, కృష్ణమూర్తి, హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: టీయూటీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్ సిల్క్ శిశు మందిర్ పాఠశాలలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.శాంతి కుమార్ సోమవారం జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ సూచనల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్, దేశ స్వాతంత్ర్యం, స్వాతంత్ర్య సమర యోధులు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 15న బహుమతులు అందజేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. కరస్పాండెంట్ లక్ష్మణరావు, హెచ్‌ఎం రవితేజ, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం ఆర్లారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, నమత తదితరులు పాల్గొన్నారు.

దారి పొడవునా అందాలే!

తిర్యాణి మండలంలోని జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. చింతలమాదర జలపాతానికి వెళ్లే దారిలోని అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. నడక దారిలో వెళ్తుంటే కన్పించే కొండవాలు ప్రాంతాలు, పచ్చని పంట పొలాలు, నీటి వనరులు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రకృతి అందాలతో పర్యాటకులు కొత్త అనుభూతికి లోనవుతున్నారు. – తిర్యాణి


చింతలమాదర జలపాతం


సూర్యాస్తమయంలో కనువిందు చేస్తున్న దృశ్యం


చింతలమాదరకు వెళ్లే దారిలోని ప్రకృతి అందాలు


నడకదారిలో పచ్చని అటవీ ప్రాంతం

బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేయస్కరం

పెంచికల్‌పేట్: బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేయస్కరమని ఐసీడీస్ సిర్పూర్ ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం చేశారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఎల్కపల్లి, పోతెపల్లి సర్పంచులు ఘనపురం కావ్య, చంద్రమౌళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హసీనా, కర్ల, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖమాన 2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని, డబ్బా పాలతో బిడ్డకు పోషకాలు అందవన్నారు. ఖమాన 1, 2, 3, 4, లక్ష్మిపూర్, సాలెగూడ మినీ అంగన్‌వాడీల టీచర్లు, సావిత్రి, పాచ్చుబాయి, నిర్మల, రాజ్‌కుమారి, వీణ పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్: సీమంతం చేస్తున్న సిబ్బంది

దహెగాంలో..

దహెగాం: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఎంపీపీ కంబగౌని సులోచన అన్నారు. సోమవారం మండలంలోని చినరాస్పెల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలల్లో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కళాకారుల ఆధ్వర్యంలో గద్దర్‌కు ఘన నివాళి

దహెగాం: ప్రజా గాయకుడు, ఉద్యమకారుడు గద్దర్‌కు సోమవారం మండల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజాల రాజబాబు ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారులు సుంకరి బాపు, పందిర్ల మల్లేశ్, దుర్గం దేవాజీ, పంబాల తిరుపతి, నాయకులు సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: ప్రజా యుద్ధనౌక గద్దర్ చిత్రపటానికి సోమవారం గ్రామపంచాయతీ కార్మికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్మిక సంఘాల నాయకులు సుద్దాల తిరుపతి, జంగు, శంకర్ తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న కళాకారులు

సామల సదాశివ ఆశయాలు నెరవేర్చాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సాహితీవేత్త సామల సదాశివ మాస్టారు ఆశయాలను నెరవేర్చాలని పద్మశాలీ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో సదాశివ మాస్టారు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా చేనేత దినోత్సవం..

చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలీ సంఘ భవనంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నాయకులు గుండా శంకర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సంతోశ్, చందు, రాజన్న, వేణు, శ్యాం, మోహన్, సంజీవ్, అజయ్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, చిప్ప సురేశ్, సత్యనారాయణ, మంగ, విజయ, పుష్పలత, సునీత, రేవతి, జైగౌరీ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సామల సదాశివ మాస్టారు వర్ధంతిని పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని బస్‌స్టేషన్ ఎదురుగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రాష్ట్రీయ రహదారిపై జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ నెలరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కార్మికులపై కనికరం చూపకపోవడం దారుణమన్నారు. నాయకులు గడ్డల వెంకన్న, ఉపేందర్, మట్ల రాజు, కేశవ్‌రావు, నాగేశ్వర్, కైలాస్, మహేశ్వర్, ప్రసాద్, శ్రీనివాస్, హారిక, పద్మ, సుగుణ, దేవమ్మ, యమున, సంధ్య పాల్గొన్నారు.

రెబ్బెన: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు సోమవారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జేఏసీ నాయకులు రమేశ్, సుధాకర్, సునీల్, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

అంధవృద్ధ దంపతులకు చేయూత

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో గల అంధ వృద్ధ దంపతులు మండిగె గోపాల్, సోమక్కలకు మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయం అందించారు. ఏఎస్సై యాదవ్ చేతుల మీదుగా దంపతులకు 25 కిలోల బియ్యం, బట్టలు, కూరగాయలు, చెప్పులు ఇతర సామగ్రి అందజేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్న దంపతులకు మాఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ ప్రతినిధి లోడెల్లి ప్రవీణ్ కుమార్ తెలిపారు. సభ్యులు బోర్కుట్ వెంకన్న, బీరయ్య, మధుకర్, బీంకరి హన్మంతు, రుషిలు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన కోటేశ్వర్‌కు సన్మానం


సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండలంలోని మారుమూల గ్రామం సోనికి చెందిన పెగడపల్లి కోటేశ్వర్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్సైగా ఎంపిక కాగా సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హైదరాబాద్‌లో కోటేశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సైగా పేద ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

వెంకటేశ్‌కు సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్సై ఫలితాల్లో ఉద్యోగం సాధించిన ఆదె వెంకటేశ్‌ను సోమవారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సన్మానించారు. మండలంలోని కోసిని గ్రామానికి చెందిన వెంకటేశ్ ప్రస్తుతం బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నాయకులు పోచయ్య, రాజన్న పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలోని ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద సోమవారం తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఎల్లులవార్ కొమురయ్య.. బస్సులో దేశీదారు తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. అతని వద్ద నుంచి 30 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలి

దహెగాం: మండలంలో ఇంకుడు గుంతల నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని అదనపు డీఆర్‌డీవో, స్వచ్ఛ సర్వేక్షణ్ మిషన్ మండల ప్రత్యేకాధికారి కుటుంబరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు, కల్వాడ, ఐనం, బొర్లకుంట, ఇట్యాల, హత్తిని, పీపీరావు కాలనీ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, ఈజీఎస్ ఏపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

జీఎంను కలిసిన ఆర్‌ఎంజీ సెక్యూరిటీ ఎండీ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవి ప్రసాద్‌ను సోమవారం ఆర్‌ఎంజీ సెక్యూరిటీ ఎండీ రామగౌని మహీధర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంను శాలువాతో సన్మానించి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మేనేజర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ కుమార్ పాల్గొన్నారు.


జీఎంను సన్మానిస్తున్న ఎండీ మహీధర్ గౌడ్

జీఎంను కలిసిన ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్..

రెబ్బెన: జీఎం రవిప్రసాద్‌ను సోమవారం ఏరియాలోని ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలరావు, లైజన్ అధికారి శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడు మంగీలాల్, అధ్యక్షుడు బానోత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి రాజయ్య, ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ వరలక్ష్మి నాయకులు కోటేశ్వర్‌రావు, హీరాలాల్, వీరన్న పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ డే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బీపీ మండల్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లిఖార్జున్‌లు మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ బాబురావ్, నాయకులు సత్యనారాయణ, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర్ ప్రసాద్ డేను ఘనంగా జరుపుకున్నారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నర్ రమేశ్ సంఘ నాయకులతో కలిసి మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు మారుతి పటేల్, ఉమేందర్, జక్కయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి: విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పలు విద్యా సంస్థలను సంఘం సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గడ్డల ప్రణయ్ కుమార్, దేవ్‌రావు, సాగర్ పాల్గొన్నారు.

తిర్యాణి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సిర్పూర్(యూ)లో ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిర్పూర్(యూ) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు ద్వారా సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్‌కు చెందిన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీసీ యువజన సంఘం నాయకులు గడ్డల ప్రణయ్‌కుమార్, సాయి కిరణ్, సాగర్ ఉన్నారు.

ఆసిఫాబాద్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ కెరమెరి మండల అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. కెరమెరి మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నాయకులు రామ్‌చందర్, బావాజీ, మారుతి పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌వో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, జూలై 26న ఇచ్చిన నోటిఫికేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా సెకండ్ ఏఎన్ఎంల యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్, అధ్యక్షురాలిగా సంతోషి, ఉపాధ్యక్షులుగా రజని, శోభ, భాగ్య, ప్రధాన కార్యదర్శిగా పుణ్యవతి, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు.


ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు, నాయకులు

సంక్షిప్త వార్తలు

లక్ష్యంతో ముందుకు సాగాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని సిర్పూర్ పేపర్ మిల్ వైస్ ప్రెసిడెంట్ ఏకే మిశ్రా అన్నారు. సిర్పూర్ పేపర్ మిల్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి సోమవారం రూ.లక్ష విలువైన పాఠ్య పుస్తకాలతో పాటు రిఫరెన్స్ పుస్తకాలు అందజేశారు. జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు. తుమ్మ రమేశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, లెక్చరర్లు డి.జనార్దన్, ఎం. రాజేశ్వర్, గ్రంథాలయాధికారి టి.దత్తాత్రేయ పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జెండాల విక్రయం

కాగజ్‌నగర్‌టౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ హర్ ఘర్ తిరంగా 2.0లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతీ పోస్టాఫీసులో జాతీయ జెండాలు విక్రయించనున్నట్లు కాగజ్‌నగర్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన వారు రూ.25 చెల్లించి జాతీయ జెండా కొనుగోలు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఆగస్టు 12వ తేదీ వరకు బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ కార్యాలయంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

చింతలమానెపల్లి: పోలీసులను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చింతలమానెపల్లికి చెందిన విలాసాగరం లోకేశ్ తన భార్య, తమ్ముడిపై పిటిషన్ ఇవ్వగా నిందితులు విలాసాగర్ నందిని, విలాసాగర్ శ్యామ్‌లు ఈనెల 5న సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది బి.కాంత, రాజేందర్‌లను పరుష పదజాలంతో దుర్భాషలాడారని తెలిపారు. విధులకు అడ్డుపడడంతో పాటు తమపై కేసు నమోదు చేస్తే విషం తాగుతామని నిందితులు బెదిరించారన్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.